క్లుప్తంగా

ఆలోచింపజేసిన ఎగ్జిబిషన్



ఆకట్టుకున్న నమూనా

మల్కాపురం: మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో సోమవారం చైతన్య పేరిట కళాశాల గణితశాస్త్ర విద్యార్థినులు ఎగ్జిబిషన్ నిర్వహించారు. దీన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి, జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు నీటి వనరులు పొదుపు,పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలు తదితర అంశాలపై స్టాల్స్ ఏర్పాటు చేశారని వివరించారు. కార్యక్రమంలో వై.అనసూయాదేవి,అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న వెంకటరమేష్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు పరిధి బాలాజీ నగర్ వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులకు వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ సోమవారం శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ నిధులు రూ.40 లక్షలతో మురుగు కాల్వలు నిర్మించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్ బొడ్డేటి విజయ్, ఏఈ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల అందజేత



రేషన్ కార్డులు అందిస్తున్న విప్ గణబాబు

గోపాలపట్నం: స్మార్ట్ రేషన్ కార్డులను 91వ వార్డు నూకాలమ్మ ఆలయం వద్ద సోమవారం ప్రభుత్వ విప్ గణబాబు అందించారు. ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కార్డులోనే కుటుంబ సభ్యులు వివరాలు పొందుపరిచినట్టు తెలిపారు. ఇందులో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే వివరాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో శ్రీహరి, ఆర్‌ఐ లక్ష్మి, నారిపిన్ని సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

59వ వార్డులో...

మల్కాపురం: ములగాడ మండల పరిధిలోని కార్డు దారులకు స్మార్టు రేషన్ సోమవారం 59వ వార్డు జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ప్రభుత్వ విప్ గణబాబు అందించారు. కార్యక్రమంలో ములగాడ తహసీల్దార్ ఎం.రమేష్,సివిల్ సప్లై అధికారి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



రైతు బజారువద్ద ప్రదర్శనఇస్తున్న కళాకారులు

గోపాలపట్నం: మర్రిపాలెం రైతు బజారులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడానికి సోమవారం నిర్వహించిన కళాజాతా ఆలోచింపజేసింది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు విజృంభిస్తాయని వివరించారు. 52వ వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ జీవీఎస్ మూర్తి, మలేరియా ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డులో పలు చోట్ల కళాజాతా నిర్వహించినట్టు చెప్పారు. పరిసరాల పరిశుభ్రత, దోమలు ఏవిధంగా పెరుగుతాయన్న అంశాలను వివరించారని తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు డేవిడ్ రాజు, వైశాలి, సముద్రం, కుమారి తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 17 వినతులు



వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంటలోని జీవీఎంసీ జోన్ – 8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు పలు సమస్యలపై 17 వినతులు వచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాబోయ్ చిల్లర దొంగలు

- ద్విచక్ర వాహనాల బ్యాటరీల అపహరణ
- పెరుగుతున్న వాహనాల చోరీలు
- ఎన్‌ఏడీలో వాహనదారుల అవస్థలు
- నిఘా పెట్టాలని కోరుతున్న ప్రజలు

ఎన్‌ఏడీ జంక్షన్‌లో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. జల్సాలకు అలవాటు పడి చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారు. ద్విచక్ర, ఇతర వాహనాల బ్యాటరీలు.. విలువైన పరికరాలు చోరీ చేస్తున్నారు.కాపర్ వైర్లను కూడా వదలడం లేదు. వీరి చర్యల వల్ల వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. నిత్యం ఏదో ఒకరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. – గోపాలపట్నం



ఎన్‌ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ దిగువన పార్కింగ్ చేసిన వాహనాలు



బ్యాటరీలు చోరీకి గురైన ద్విచక్ర వాహనాలు

వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసే వారు.. కళాశాలలకు వెళ్లే ఎన్‌ఏడీ పరిసర ప్రాంతాలకు చెందిన వారు తమ వాహనాలను ఎన్‌ఏడీ జంక్షన్‌లోని ఫ్లైఓవర్ కింద పార్కింగ్ చేస్తారు. వారు తిరిగి సాయంత్రమో.. ఏ రాత్రికో చేరుకుంటారు. అలాంటి వారు ఆకతాయిలు చేసే దొంగతనాల వల్ల నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బ్యాటరీల అపహరణ

వాహనాల్లో బ్యాటరీలు చోరీ చేసే ఘటనలు అధికమయ్యాయి. వీరు పట్టపగలే అందరూ చూస్తుండగానే ద్విచక్రవాహనాల్లో బ్యాటరీలు దొంగతనానికి పాల్పడుతున్నారు. వీరంతా మద్యానికి బానిసైన వారేనని స్థానికులు చెబుతున్నారు. ఎన్‌ఏడీ జంక్షన్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జ్ దిగువన చాలా వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. ఇలాంటి వాహనాలనే టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల బ్రిడ్జి కింద పెట్టిన 10 నుంచి 15 వాహనాల బ్యాటరీలను దోచే చేశారు. దీనిపై స్థానికులు ఎయిర్‌పోర్టు క్రైం పోలీసులకు సమాచారమిచ్చారు. ఒక వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీంతో ఇక్కడి దొంగతనాలపై అప్రమత్తమయ్యారు.

విద్యుత్ కేబుల్ తీగలు కూడా..

ఎన్‌ఏడీ, కాకానినగర్, సాకేతపురం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ కేబుల్ చోరీకి పాల్పడుతున్నారు. ఫ్రిడ్జ్ విద్యుత్ వైర్లు, ఏసీల తీగలు, కాపర్ పైప్‌లు వంటివి చోరీ చేస్తున్నారు. వీటిని స్క్రాప్ దుకాణాల్లో అమ్మి మద్యం, ఇతర మత్తుపదార్థాలు సేవిస్తున్నారు. బాధితులు ఇలాంటి వాటి కోసం స్టేషన్ మెట్లు ఎందుకు ఎక్కడం అనే భావనతో పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదని చెబుతున్నారు.


వాహనాల చోరీ

ఎన్‌ఏడీ జంక్షన్‌లో వాహనాల చోరీలు కూడా ఎక్కువవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. బ్రిడ్జి దిగువన భారీ స్థాయిలో వాహనాలు ఉండడంతో ఏవాహనం ఎవరు తీసుకు వెళ్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. కొంతమంది అక్కడే తిష్ట వేసి ఎవరూ లేని సమయం చూసి వాహనాలు చోరీ చేస్తున్నారని చెబుతున్నారు.

పోలీసులు నిఘా పెట్టాలి

వాహనాలు పార్కింగ్ చేసే ఈ ప్రాంతంలో నిఘాపెట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దొంగతనాలకు చెక్ పెట్టాలని విన్నవిస్తున్నారు.

బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ విజయవంతం



మళ్ల విజయప్రసాద్

గోపాలపట్నం: బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం విజయవంతం అయిందని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మళ్ల విజయ ప్రసాద్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెలరోజుల పాటు నియోజకవర్గంలో కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలోని 14 వార్డుల ప్రజలకు కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ఎలా మోసం చేస్తుందో తెలియజేయడంలో విజయం సాధించామని తెలిపారు. ఇందుకు సహకరించిన కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు అండగా పోరాటాలు చేద్దామని పేర్కొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలో నిర్మించిన సామాజికభవనాన్ని ప్రభుత్వ విప్ పి.గణబాబు సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరమాండల్ సంస్థ సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన సామాజికభవనం గ్రామంలోని 420 కుటుంబాలకు ప్రయోజనకరంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ ఉన్నతాధికారులు జ్ఞానసుందరం,జయగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చవితి మార్కెట్‌పై వరుణుడి ఎఫెక్ట్



చిరు జల్లులకు విగ్రహాలు తడవకుండా కవర్ కప్పుతున్న వ్యాపారస్తురాలు



విక్రయానికి ఉంచిన వినాయకుని ప్రతిమలు

చిరు జల్లులతో ఇక్కట్లు

మల్కాపురం: మరో 24 గంటల్లో వినాయక చవితి ఉత్సవాలు ఆరంభం కానున్నాయి. గణపతి పూజకు అవసరమైన పూజా సామగ్రి, ఇతర వస్తువులను ఎక్కడికక్కడ అందుబాటులోకి తెచ్చారు. కొనుగోలు దారులు కూడా మార్కెట్ బాట పట్టారు. ఇలాంటి తరుణంలో చిరుజల్లులు కురవడంతో వ్యాపారులతో పాటు వినియోగదారులు ఇక్కట్లు పడుతున్నారు. వర్షం పెరిగితే వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. వినాయకుని విగ్రహాలు మల్కాపురం,శ్రీహరిపురం ,గుల్లలపాలెం తదితర మార్కెట్ ప్రాంతాల్లో అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. సోమవారం సాయంత్రం పారిశ్రామిక ప్రాంతలో కురిసిన వర్షం వల్ల వినాకుని ప్రతిమలు అమ్మకాలు ఆశించినంత మేర సాగలేదు. వినాయకుని ప్రతిమలు తడవకుండా వాటిపై ప్లాస్టిక్ కవర్లు కప్పుకుని ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది.అలాగే పూలు, పూజా సామగ్రి అమ్మకాలు కూడా నెమ్మదించాయి. మంగళవారం కూడా వర్షం పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు హెచ్చరించడంతో వ్యాపారుల్లో కలవరం మొదలైంది.

ఆకట్టుకుంటున్న మండపాలు



శ్రీనివాసనగర్‌లో వినాయక మండపం



యుద్ధ హెలికాప్టర్ సెట్‌కు తుది మెరుగులు దిద్దుతున్న యువకుడు

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్‌ఏడీ పరిసరాల్లో వినాయక మండపాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కొందరు సంప్రదాయ నమూనాలతో మండపాలు నిర్మిస్తుంటే మరి కొందరు ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో నిర్మిస్తున్నారు. జీవీఎంసీ 91వ వార్డు శ్రీనివాసనగర్‌లో స్థానిక కమిటీ సభ్యులు వేసిన సాంప్రదాయ సెట్ ఆకట్టుకుంటోంది. అలాగే జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో ఆపరేషన్ సింధూర్ పేరుతో యుద్ధ హెలీకాప్టర్ నమూనాతో మండపాన్ని తయారు చేస్తున్నారు. ఈ హెలీ కాప్టర్ పై ఫ్యాను, వెనుక ఉన్న ఫ్యాన్ తిరిగే విధంగా వేస్తున్నారు.సైనికుడిగా వినాయకుడు పైలెట్‌గా మూషికాన్ని తయారు చేస్తున్నారు. ఇది చూపరులకు ఆలోచింపజేసేదిగా స్ఫూర్తి నిచ్చేదిగా తయారవుతుందని చెబుతున్నారు.



ఆపరేషన్ సింధూర్‌లో వాడిన మిసైల్ నమూనాలు

దోపిడీకి చెక్ పెట్టాలని వినతి



కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న సామాజిక కార్యకర్త పెంటిరాజు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో భారీ వినాయకుడి పేరుతో సందర్శకుల నుంచి నగదు దోచుకునేందుకు నిర్వాహకులు యత్నిస్తున్నారని.. ఈ దోపిడీకి అడ్డుకట్టు వేయాలని సామాజిక సేవా కార్యకర్త మొల్లి పెంటిరాజు సోమవారం కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లో పెద్ద వినాయకుడిని నెలకొల్పుతామని నక్కవానిపాలెం వద్ద నిర్వాహకుడు లక్షల రూపాయిలు వసూలు చేశారని పేర్కొన్నారు. ఆయన ఏర్పాటు చేయనున్న వినాయకుడి మండపం ప్రాగణంలో స్టాల్స్ ఏర్పాటు చేసి వాటిని అద్దెకు ఇస్తున్నారని ఆరోపించారు. అంతే కాక పార్కింగ్ ఫీజు,స్వామిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు వీఐపీ ద్వారం కి టికెట్ పెట్టారని వివరించారు.వీటిని అడ్డుకొని భక్తులకు స్వామి దర్శనం ఉచితంగా కల్పించాలని కోరారు.

ఎర్రజెండా రెపరెపలు



గోపాలపట్నంలో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

గోపాలపట్నం: గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డు ఎర్ర జెండాలతో ఎరుపెక్కింది. కార్మికుల నినాదాలతో హోరెత్తింది. సీఐటీయూ 11వ జిల్లా మహాసభలు పురస్కరించుకుని సోమవారం సాయంత్రం గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో 93 మున్సిపాలిటీల్లో సీఐటీయూ ప్రధాన యూనియన్‌గా ఉందన్నారు. సీటూ నాయకుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ విలీన పంచాయతీ కార్మికులకు మినిమం టైమ్ స్కేల్ తీసుకు రావాలని హైకోర్టు ఆదేశాలిచ్చిందని తెలిపారు. గతంలో సాధించిన విజయాలు, పోరాటాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు టి. నూకరాజు, జిల్లా కార్యదర్శి ఆర్‌కే ఎస్‌వీ కుమార్, ఉరుకూటి రాజు, ఎస్. రమణ, జోన్ నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపించారు. అనంతరం ఉభయ దాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



ఆలయ ప్రాంగణలో మొక్క నాటుతున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: మొక్కలు నాటి.. వాటిని సాకడం అదృష్టంగా, బాధ్యతగా భావించాలని మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని శ్రీ లలిత సుబ్రహ్మణ్యేశ్వర సమేత మల్లికార్జున స్వామి దేవాలయం ప్రాంగణంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కాలుష్యం పెరిగిన నేపథ్యంలో మొక్కలు నాటడం చాలా అవసరమన్నారు. ఇందుకు సహకరించిన వారంతా భావితరాలకు విధాతలుగా నిలుస్తారని అన్నారు. మొక్కలు నాటడం ఎంత అవసరమో అవి పెరిగి పెద్ద అయ్యేవరకు సాకడం అంత గొప్పవిషయమన్నారు. ఇక్కడి మొక్కలను కాలనీ వాసులు దత్తత తీసుకోవాలని కోరారు. ప్రాంగణంలో ఉసిరి, సపోటా, మామిడి, వేప, రావి, నక్షత్ర, మారేడు, జామ, కొబ్బరి వంటి ఔషధ మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు సీహెచ్‌వీ సురేష్, ఎస్. రంగారావు, ఆలయ ధర్మకర్త మాండవ రవికుమార్, మురళీపట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐకి సీపీ ప్రశంస



సీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

గోపాలపట్నం: పలు నేరాలను ఛేదించడంతో ప్రతిభ కనబరిచిన క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావును విశాఖనగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అభినందిస్తూ ప్రశంసాపత్రం అందించారు. కంచరపాలెం, పెందుర్తిలో జరిగిన దొంగతనాలను ఛేదించి నగలు, నగదును రికవరీ చేయడంలో చూపిన ప్రతిభకు ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ వెస్ట్ సబ్ డివిజన్ సిబ్బంది సమన్వయంతో పని చేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు.

పర్యావరణ హితంగా పండగలు



మట్టి విగ్రహాలు, మొక్కలు పంపిణీ చేస్తున్న విప్ గణబాబు, జేడీ ఫౌండేషన్ సభ్యులు



మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు

గోపాలపట్నం: పండగలు పర్యావరణహితంగా జరుపుకోవాలని ప్రభుత్వ విప్ గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపం ప్రాంగణంలో సోమవారం జేడీఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి వినాయక విగ్రహాలు, చామంతి మొక్కల పంపిణీని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ జేడీ ఫౌండేషన్ సభ్యులు చేస్తున్న కార్యక్రమాలు పర్యావరణానికి ఉపయోగపడేవని అభినందించారు. మట్టి విగ్రహాలతో పూజించే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూడి అను, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు సింధియా న్యూకాలనీలో షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు, వినాయక వ్రత కథ పుస్తకాలు సోమవారం అందజేశారు. షిప్‌యార్డ్ జీఎం మహాపాత్ర, డీజీఎం సెక్యూరిటీ సుశీల్‌కుమార్, గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి పైలా శ్రీరామ్మూర్తి కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పైలా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు, కాలుష్యాన్ని నియంత్రించేందుకు మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, కాలనీ నివాసితులు పాల్గొన్నారు.

అపార్టుమెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి

పెందుర్తి: నేరాల నియంత్రణకు పోలీసులకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాసరావు కోరారు. అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌస్‌లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాలపై స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో సోమవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పండగల వేళ చైన్ స్నాచింగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలు అంశాలపై సూచనలు చేశారు. క్రైం విభాగం ఎస్‌ఐ డి.సూరిబాబు, అపార్ట్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.